క్లుప్తంగా

విద్యతోపాటు కళలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న గుడ్లూరు మయూర్

శ్రీకాళహస్తి: తమ విద్యాసంస్థలో విద్యతోపాటు కళలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు డైరెక్టర్ గుడ్లూరు మయూర్ తెలిపారు. ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్‌డేను పురస్కరించుకుని 1నుంచి 10వ తరగతి వరకు పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుబ్బరత్నం, పరసురామ్, డ్రాయింగ్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ కండ్రిగలో కోతుల బెడద


బుచ్చినాయుడుకండ్రిగలో ఇళ్లవద్ద ఉన్న కోతుల గుంపు

వరదయ్యపాళెం: బుచ్చినాయుడుకండ్రిగ మండల కేంద్రంలో కోతుల బెడదతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కోతులు ఇళ్లలోకి ప్రవేశించి, వస్తువులను చిందరవందర చేస్తుండటం, తినే తినేవాటిని తీసుకుని ఉడాయిస్తున్నాయి. వాటిని తరిమేందుకు యత్నిస్తే వాటి దైన శైలిలో మీదకు వస్తుండడంతో మహిళలు హడలిపోతున్నారు. కోతులకు దెబ్బకు తలుపు వేసుకుని ఇంటి నుంచి వెలుపలికి రావడం లేదు. బయట వ్యక్తులు కోతులను పట్టుకొచ్చి గ్రామంలో వదలి వెళ్లిపోతున్నారని, దీంతో గ్రామంలో కోతుల సంచారం పెరిగిపోయిందని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించి కోతులను పట్టి అడవులలో వదలివేయాలని కోరుతున్నారు.

విద్యార్థుల్లో ఇంగ్లిష్ నైపుణ్యం పెంపొందించండి


ఇంగ్లిష్ వర్క్ బుక్స్‌ను పరిశీలిస్తున్న బీఎన్ కండ్రిగ ఎంఈఓ మునిసుబ్రమణ్యం

వరదయ్యపాళెం: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్‌పై నైపుణ్యం పెంపొందించేలా చూడాలని ఆ మండల ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం ఆయన చెల్లమాంబపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల ఇంగ్లిష్ వర్క్ బుక్స్‌ను, వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం టీచర్లను పైవిధంగా ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇంగ్లిష్‌పై ప్రత్యేక తరగతులను నిర్వహించాలని కోరారు. క్లాసులో ఇంగ్లిష్‌లో మాట్లాడం, రాయడంలో నేర్పరులుగా ఉండాలన్నారు.

పారదర్శకంగా పశుగణన


పశుగణన స్టిక్కర్లు అంటిస్తున్న మండల పశువైద్యాధికారి శిల్పారెడ్డి

ఏర్పేడు: మండలంలో ఆమందూరులో శుక్రవారం అఖిలభారత పశు గణన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పశువులను నమోదు చేసే కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ శిల్పారెడ్డి ఆధ్వర్యంలో బ్రోచర్ ఆవిష్కరించి, ఇంటింటికీ స్టిక్కర్ వేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డివారి గురువారెడ్డి, సర్పంచ్ బాలగురునాథం యాదవ్, వెటర్నరీ అసిస్టెంట్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాలికకు ఆర్థిక సాయం

నారాయణవనం: మండలంలోని ఎగువబొప్పరాజుపాళ్యంలో ఆలయ ప్రహరీగోడ కూలి గాయపడిన రచన(9)కు గాండ్ల సంఘం శుక్రవారం ఆర్థిక సాయాన్ని అందజేసింది. గ్రామ గ్రామదేవత ఆలయ ప్రహరీగోడ వర్షాలకు ఈనెల 7వ తేదీ ఆదివారం రాత్రి కూలి రచన తీవ్రగాయాల పాలైంది. కోలుకున్న రచనకు మెరుగైన చికిత్స నిమిత్తం గాండ్ల సంఘం ప్రతినిధులు జయకుమార్, శ్రీనివాస్, హరికృష్ణ, పెరుమాళ్, ధనుంజయులు, గిరి రూ 55 వేలను శుక్రవారం బాధితురాలి తల్లిదండ్రులకు అందజేశారు.

వరించిన కాలం



వరుణుడు కరుణించాడు.. మేఘం వర్షించింది.. ఎండిన చెరువులు నిండుకుండలయ్యాయి.. సాగుకు ఊతమొచ్చింది.. అన్నదాతలో సాగుపై ఆశ చిగురించి పొలం బాట పట్టాడు.. ట్రాక్టరెక్కి పొలం దున్ని పైరు పెట్టడానికి సన్నద్ధమయ్యాడు.. అక్టోబర్ చివరిలోనే నాట్లు వేయడానికి సన్నద్ధమవుతున్నాడు.. ఫలితంగా ఈ రబీలో వరి పంట రికార్డుస్థాయిలో సాగు కానున్నది.

- రైతాంగం వరినాట్లకు సన్నద్ధం
- జోరుగా నారుమడులు సిద్ధం
- బిజీబిజీగా అన్నదాతలు
- కూలీలతో కళకళలాడుతున్న పొలాలు



మరదవాడలో అడుసు మడక దున్నుతున్న ట్రాక్టర్, వరి నార్లు సిద్ధం చేస్తున్న కూలీలు

వరదయ్యపాళెం: సత్యవేడు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఆ దిశగా ఈ నెల 15 నుంచి ప్రారంభమైన రబీ సీజన్‌కు నాట్లు వేసేలా వరినారు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. రెండు వారాల నుంచి నారుమడులను సాగు చేసేందుకు ఓ వైపు విత్తనాలు కొనుగోలు, దుక్కి దున్నకాల్లో రైతులు బిజీగా ఉన్నారు. సత్యవేడు సబ్ డివిజన్ పరిధిలోని పిచ్చాటూరు, నాగలాపురం, వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో సుమారుగా 14వేల హెక్టార్లలో ప్రస్తుత రబీ సీజన్‌కు వరినాట్లు వేయనున్నారు. అందుకు సంబంధించి రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. మరికొన్ని చోట్ల ముందస్తుగానే వరినాట్లు వేస్తున్నారు.

ఊరటనిచ్చిన వర్షాలు

పది రోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు ప్రవహించి చెరువులు జలకళను సంతరించుకుంది. 90 శాతం చెరువులు కలుజులు కూడా పారుతున్నాయి. దీనికి తోడు తెలుగుగంగ కాలువలో సైతం నీరు ప్రవహిస్తుండడంతో ఉపకాలువల ద్వారా చెరువులకు గంగనీరు చేరుతోంది. దీంతో ఈ ఏడాది సాగునీటికి ఇబ్బందులు రావని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత రబీ సీజన్‌కు బీపీటీలు, ఎంపీయూ 1271, ఆర్ఎన్ఆర్‌లు ఎక్కువ మోతాదులో రైతులు సాగు చేసేందుకు వరినార్లు కూడా సిద్ధం చేసుకున్నారు.


సీఎల్ఎన్‌పల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

పొలాల్లో కూలీల సందడి

వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో దుక్కి దున్నకాలు, నారు సేకరణ, వరినాట్లు వేసేందుకు అటు పురుషులు, ఇటు మహిళలతో పొలాలు కళకళలాడుతున్నాయి. పలు ప్రాంతాల నుంచి వలస వచ్చిన కూలీలతోనే పనులు చేపడుతున్నారు. స్థానికంగా నియోజకవర్గ పరిధిలో అటు శ్రీసిటీ, ఇటు ఏపీఐఐసీ పరిధిలో అనేక పరిశ్రమలు రావడంతో ఎక్కువ శాతం స్థానికులు పరిశ్రమలకు వెళుతున్నారు. దీంతో వ్యవసాయ పనులకు స్థానికంగా కూలీల కొరత ఏర్పడింది. దీంతో శ్రీకాకుళం, పశ్చిమ బెంగాల్, గుంటూరు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన వలస కూలీలతో వ్యవసాయ పనులు చేపడుతున్నారు. ఎకరాలకు రూ.5500 చొప్పున అన్ని పనులతో వరినాట్లు వేస్తున్నట్లు కూలీలు చెబుతున్నారు.

నాట్లు వేస్తున్నాం



ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభమయ్యే సరికి తుపాన్ కారణంగా మూడు రోజుల పాటు వర్షాలు కురవడం, దానికి ముందే తెలుగుగంగ ప్రధాన కాలువలో తమిళనాడుకు నీటిని విడుదల చేయడంతో సకాలంలో చెరువులకు సాగునీరు చేరింది. దీంతో మా గ్రామ పరిధిలో అక్టోబర్ ప్రారంభంలోనే నారుమడులు సిద్ధం చేసుకున్నాం. నాటేందుకు నారు సైతం ఏపుగా పెరగడంతో వారం రోజులుగా ముమ్మరంగా నాట్లు వేస్తున్నాం. వారం రోజుల్లో మా గ్రామ పరిధిలో వరి నాట్లు పూర్తవుతాయి.

–గంగయ్య, రైతు, సీఎల్ఎన్‌పల్లి, వరదయ్యపాళెం మండలం

మరో వారంలో నాట్లు మొదలుపెడతాం



వర్షం కురవడంతో చెరువుల్లో నీళ్లు వచ్చాయి. దీంతో 10 రోజుల క్రితం నారు మడులు సిద్ధం చేశాం. ప్రస్తుతం ముమ్మరంగా దుక్కి దున్నకాలు, గనివార చెక్కే పనుల్లో బిజీగా ఉన్నాం. ఈ నెలాఖరుకు నాట్లు మొదలుపెడతాం. ఈ పనుల్లో ప్రస్తుతం రైతులందరం తలమునకలై ఉన్నాం. వరినాట్లను సకాలంలో పూర్తి చేయడానికి వడివడిగా పనులు చేస్తున్నాం. ఇందుకోసం బయటి ప్రాంతాల నుంచి కూలీలను తెచ్చుకున్నాం. వారితో వ్యవసాయ పనులు చేయిస్తున్నాం.

–రాంబాబు, రైతు, కోవూరుపాడు, వరదయ్యపాళెం మండలం

రైతులకు సలహాలిస్తాం



సత్యవేడు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో రబీలో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేస్తారు. ఈ పంట సాగు ఇప్పటికే రెండు వారాల కిందట మొదలైంది. ఎక్కడికక్కడ వ్యవసాయ క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా వరి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. అంతేకాక ఎరువులను ఏ పంటకు ఎంత మోతాదులో వినియోగించాలో తెలియజేస్తున్నాం.

–సుబ్రమణ్యం, ఏడీఏ,
సత్యవేడు వ్యవసాయశాఖ డివిజన్

అనుమతి లేకుండా టపాకాయలు విక్రయిస్తే చర్యలు

నాగలాపురం: దీపావళి పండుగ పురస్కరించుకుని పోలీసుల అనుమతి పొందకుండా టపాకాయలు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ సునీల్ కుమార్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ, ముందస్తు జాగ్రత్తగా పోలీసుల అనుమతి లేకుండా టపాకాయలు విక్రయాలు చేయకుండా గట్టి నిఘా ఉంచామన్నారు. అలాగే ప్రజలు టపాకాయలు కాల్చేటప్పుడు తమ పిల్లలు ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు


మరదవాడలో కూలిన విద్యుత్ స్తంభం

వరదయ్యపాళెం: మండలంలోని మరదవాడలో ఇటీవల కురిసిన వర్షాలకు రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అయితే విరిగిన ఆ స్తంభాలను తొలగించి నూతన స్తంభాల ఏర్పాటుపై దృష్టి సారించాల్సిన ట్రాన్స్‌కో అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై ఆ గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. సుమారు 100 మీటర్ల మేరకు రోడ్డు పక్కన విద్యుత్ తీగలు అడ్డంగా వేలాడుతున్నాయి. అటువైపు వెళ్లాల్సిన పశువులు సైతం సంబంధిత విద్యుత్ లైన్లలో తగులుకుని ఇబ్బంది పడుతున్నాయి. విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినప్పటికీ కిందకు వేలాడుతున్న తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి నూతన స్తంభాలను ఏర్పాటు చేసి లైన్లను యథావిధిగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

శాస్త్రోక్తంగా శుక్రవార ఉత్సవం


ఊరేగుతున్న అమ్మవారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాత్రి శాస్త్రోక్తంగా శుకవార ఉత్సవం నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఉత్సవమూర్తికి ఆలయ అలంకార మండపంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి ఆలయ ప్రాకారంలో శుక్రవార ఉత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

కేంద్ర మంత్రికి వీడ్కోలు


కేంద్రమంత్రికి వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన వీడ్కోలు పలికారు. తిరుపతి జిల్లా పర్యటన అనంతరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పుష్పగుచ్ఛాలను అందించి వీడ్కోలు పలికారు.

'రాస్'లో వేడుకగా దసరా ఉత్సవం


పూజ చేస్తున్న రాస్ సిబ్బంది

రేణిగుంట: మండలంలోని కరకంబాడి ఇందిరానగర్‌లో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం పొదుపు సంఘాల క్లస్టర్ లీడర్ల నడుమ దసరా మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రాస్ పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు మాట్లాడుతూ రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా 44 ఏళ్లుగా ఎనలేని సేవలను అందిస్తున్నామన్నారు. పరిసర గ్రామాల్లో 16 సంవత్సరాలుగా ఈ ట్రస్టు ద్వారా పొదుపు సంఘాల సభ్యులకు, వారి కుటుంబాల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాలతో పాటు రాస్ కేవీకే ద్వారా వ్యవసాయపరమైన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు స్వయం ఉపాధిపై అనేక ఉచిత శిక్షణ కార్యక్రమాలను ఇస్తున్నామని చెప్పారు. ఈ పూజలో పాల్గొన్న పొదుపు సంఘాల క్లస్టర్ లీడర్ల అందరికీ పసుపు, కుంకుమ, ప్రసాదాలను అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు, ట్రస్ట్ సిబ్బంది, క్లస్టర్ లీడర్లు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ సమగ్రాభివృద్ధే లక్ష్యం


పశుగణన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: పశుగణనతో పాడి రైతులకు మేలు చేకూరుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. నారాయణవనంలో శుక్రవారం ఆయన 24వ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆవుదూడలు ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. పశు సంవర్ధక రంగం, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడేలా కార్యక్రమాలు సమర్థవంతంగా రూపొందించడానికి పశుగణన దోహదపడుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా శుక్రవారం నుంచి 2025 ఫిబ్రవరి 2025 వరకు అఖిల భారత పశుగణన కార్యక్రమం జరుగుతుందని, 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీగా సమాచారాన్ని సేకరిస్తున్నట్లు మండల పశు వైద్యాధికారులు భార్గవి, కుమార్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కనపర్తి విద్యార్థిని


మీనాక్షి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మీనాక్షి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్–14 యోగా పోటీల్లో సత్తా చాటింది. నవంబరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మీనాక్షి పాల్గొననుంది. ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు మీనాక్షిని అభినందించారు.

మోదీ ఆశయాలను అందిపుచ్చుకోవాలి


పాఠశాలలో మన్‌కీ బాత్ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రేణిగుంట: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలను భావితరం అందిపుచ్చుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ పిలుపునిచ్చారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. బీడీ బాలాజీ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమాన్ని 60 రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తామన్నారు. 15,000 మంది విద్యార్థులతో మన్‌కీ బాత్ నిర్వహించి ప్రధానికి చిరుకానుక అందిస్తామని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప మాట్లాడుతూ మోదీ ఆలోచనలను భావితరం అందిపుచ్చుకుంటూ భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, తేజోవతి, శీనప్ప, యతేందర్ రెడ్డి, జాన్ మధుకర్, వెంకటాద్రి యాదవ్, పూమని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎంపిక


యూటీఎఫ్ నూతన కార్యవర్గం

వరదయ్యపాళెం: మండల యూటీఎఫ్ కార్యవర్గాన్ని స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్‌బాబు, శివకుమార్, విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా శశికుమార్, ప్రధాన కార్యదర్శిగా సురేష్ భగవాన్, గౌరవాధ్యక్షులుగా రామకృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకటమోహన్, రాజు, ఇతర సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి: దాడి కేసులో నలుగురు నింతులను అరెస్టు చేసినట్లు 1వ పట్టణ సీఐ గోపి తెలిపారు. ఆయన కథనం మేరకు.. రైల్వేస్టేషన్ సమీపంలో ఈనెల 19న పెళ్లకూరు మండలం, ఆర్లపాడు గ్రామానికి చెందిన తరుణ్, తేజ అనే వ్యక్తులపై పట్టణానికి చెందిన పెరుమాల్, బాలాజీ, రాహుల్, కోమల్ అనేవారు దాడిచేశారు. ఆపై వారి నుంచి రెండు ఫోన్లు, రూ.250 నగదు లాక్కున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు పట్టణంలోని నంది రెస్టారెంట్ వద్ద దాడిచేసిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నేరానికి ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు తరలించగా వారికి రిమాండ్ విధించారు.

ఆధునిక వ్యవసాయంతో ఆదాయం

పుత్తూరు: ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా అధిక ఆదాయం ఆర్జించవచ్చని కృషి విజ్ఞాన సంస్థ శాస్త్రవేత్త టి.రామ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక రాస్ కార్యాలయంలో నేటి వ్యవసాయం–ఆధునిక సాంకేతికపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగు ఖర్చులు తగ్గించుకుని, అధిక దిగుబడులు సాధించడానికి లోతు దుక్కులు, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, సమగ్ర వ్యవసాయ విధానం, నేరుగా వరి విత్తే డ్రం సీడర్ విధానంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానం, వివిధ రకాల కషాయాలు, ఎరువుల గురించి వివరించారు.

ఊంజల్ సేవలో పద్మావతి అమ్మవారు



నారాయణవనం: పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను చేశారు. ఉదయం 7 గంటలకు వెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేసారు. సాయంత్రం నిత్యకైంకర్యాలను నిర్వహించిన అర్చకులు తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఉయ్యాల సేవలో భక్తులకు కనువిందు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనుమతి లేకుండా జీ ప్లస్ 5 భవన నిర్మాణం

- అడ్డుకున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి


చిలమత్తూరులో పనులను అడ్డుకుంటున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

వరదయ్యపాళెం: ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ పంచాయతీలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలకు పూనుకుంటే కఠిన చర్యలు తప్పవని చిలమత్తూరు పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు హెచ్చరించారు. పంచాయతీలో జీప్లస్ 5 భవన నిర్మాణాన్ని శుక్రవారం స్థానిక సర్పంచ్‌తో కలసి అడ్డుకున్నారు. సంబంధిత భవనానికి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు లేవని స్థానిక సర్పంచ్ చెప్పారు.

నేడు పవిత్రోత్సవాలకు అంకురార్పణ


శ్రీనివాసమంగాపురం ఆలయం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో మొదటిరోజైన ఆదివారం ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ చేపట్టనున్నారు. 29న మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ చేయనున్నారు. చివరిరోజు 30వ తేదీ రాత్రి 7 గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్ల వీధి ఉత్సవం నిర్వహించనున్నారు.

సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించండి


సత్యవేడులో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త మహేశ్వర్ రెడ్డి

సత్యవేడు: రబీలో ప్రధానంగా సాగు చేసే పంటల సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అగ్రికల్చర్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి ప్రధాన శాస్త్రవేత్త మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు వరదయ్యపాళెం మండలాలకు చెందిన అగ్రికల్చర్ అసిస్టెంట్ల(రైతు సేవా కేంద్రం సిబ్బంది) డివిజన్ స్థాయిలో సస్యరక్షణ పద్ధతులపై సామర్థ్యం పెంపుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కలుపు రకాలు, రసాయనాల ఎంపిక, కలుపు రసాయనాలు వాడే పద్ధతి, పంట వేయక ముందు కలుపు నిర్మూలన, విత్తిన వెంటనే 2–8 రోజుల్లో కలుపు మందు చల్లడం, కలుపు మొక్కలపై పిచికారీ చేసే పద్ధతి, పిచికారీకి వాడే పరికరాలు, కలుపు రసాయనాల వాడుకలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్త మహేశ్వర్ రెడ్డి అవగాహన కల్పించారు. పంటలను ఆశించే చీడపీడలు, వాటి నివారణ పద్ధతులు, తక్కువ పెట్టుబడితో దిగుబడులు, అధిక నికరాదాయం సాధించేందుకు సమగ్ర పంటల యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం పాటించాలని సూచించారు. ఏడీఏ సుబ్రమణ్యం మాట్లాడు,తూ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకుని గ్రామాలకు వెళ్లి రైతులకు సలహాలు–సూచనలు ఇవ్వాలన్నారు. రైతుల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి, ఏఓలు ఆర్.మురళి, సి.సంజీవరెడ్డి, ఆర్.శేఖర్ రెడ్డి, ఏవీ సుబ్బారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.